SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 860 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | సోమవారం 20-07-2026



## ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు
# సమాన హక్కులు

- యూసీసీ బిల్లుకు కేబినెట్ ఆమోదం
- యూసీసీ బిల్లుకు మధ్యప్రదేశ్ కేబినెట్ ఆమోదం
- ఇకపై అన్ని మతాల వారికి సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం వ్యాఖ్య

**ఢిల్లీ :**

ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)తో ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నామని తెలిపారు."ఈ రోజు మధ్యప్రదేశ్ కేబినెట్ ఉమ్మడి - మిగతా 2 లో

# మార్స్‌లో గ్రహాంతరవాసులు కాదు.. మన బ్యాక్టీరియాలే మనకు ముప్పా

- అంగారక గ్రహంపైకి మనుషులను పంపే క్రమంలో కొత్త అధ్యయనం
- వ్యోమగాములతో వెళ్లే సూక్ష్మజీవులే పెద్ద ముప్పని అంచనా
- అంగారకుడిపై తీవ్ర అతినీలలోహిత కిరణాలు, గడ్డకట్టే ఉష్ణోగ్రతలు
- ఆ వాతావరణంలో కొన్ని బ్యాక్టీరియాలు తమ స్వభావాన్ని మార్చుకునే ప్రమాదం
- కొన్ని సూక్ష్మజీవులు మరింత విషపూరితంగా మారే ప్రమాదం

**ఢిల్లీ :**

అంగారక గ్రహంపై మనుషులను పంపేందుకు ప్రపంచ అంతరిక్ష సంస్థలు వేగంగా సిద్ధమవుతున్న వేళ.. శాస్త్రవేత్తల కొత్త అధ్యయనం ఆసక్తికర ప్రశ్నను తెరపైకి తెచ్చింది. మార్స్‌పై ఉండే జీవుల కంటే.. భూమి నుంచి వ్యోమగాములతో వెళ్లే సూక్ష్మజీవులే భవిష్యత్‌లో పెద్ద ముప్పుగా మారే - మిగతా 2 లో







## పశ్చిమాసియాలో
# ముదురుతున్న యుద్ధం

- ఇరాన్ దాడిలో ఇద్దరు అమెరికా సైనికుల మృతి!
- జోర్డాన్‌పై ఇరాన్ క్షిపణుల దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మృతి
- యుద్ధం ప్రారంభమయ్యాక ఇప్పటి వరకు 16 మంది మృతి
- అమెరికాకు "మరచిపోలేని పాఠాలు" చెప్తామన్న మొజ్తబా ఖమేనీ

# ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు

- బూతులు, తిట్లు, అసభ్య పదజాలం వాడడం 'అశ్లీలత' కాదు - సుప్రీం కోర్టు
- ఐపీసీ సెక్షన్ 294(బి) పరిధిలోకి అసభ్య పదజాలం రాదు- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- "ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తించేదిగా ఉండాలి



**ఢిల్లీ :**

బూతు మాటలు, దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించినంత మాత్రాన, అవి ఎంత అభ్యంతరకరంగా లేదా సభ్యత లేనివిగా ఉన్నప్పటికీ 'అశ్లీలత' నేరం కిందకు రావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 294 కింద ట్రయర్ కోర్టు తనకు విధించిన శిక్షను హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, "కేవలం తిట్టడం లేదా అసభ్య - మిగతా 2 లో




## కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం
## సముద్రంపాలైన ముడిచమురు

- నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం
- పైప్‌లైన్ పగిలి సముద్రంలోకి భారీగా చేరిన ముడి చమురు
- నిర్వహణ లోపాలే కారణమని ప్రాథమిక అంచనా
- ఘటనపై విచారణకు ఆదేశించిన పోర్టు అధికారులు
- పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో శనివారం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పోర్టులోని రెండో బెర్తు వద్ద ముడి చమురు రవాణా చేసే పైప్‌లైన్ పగిలిపోవడంతో పెద్ద ఎత్తున క్రూడాయిల్ సముద్రంలోకి లీకైంది. ఈ - మిగతా 2 లో

# 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు


- జాతీయ సినీ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- విజేతలపై అభినందనల వర్షం
- తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలు గర్వకారణమన్న ముఖ్యమంత్రి
- కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి మూలస్తంభాలని వ్యాఖ్య
- తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్ష



**అమరావతి :**

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు.తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. "కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి" అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్ట్‌లో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక - మిగతా 2 లో

## ఏపీలో మళ్లీ
# కరోనా కలకలం




- నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో కొత్త కేసులు
- క్యాన్సర్ చికిత్స పొందుతున్న బాలుడికి, డయాలసిస్ చేయించుకుంటున్న బాలికకు పాజిటివ్
- వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్
- ఆందోళన వద్దని చెబుతున్న ఆరోగ్య శాఖ అధికారులు

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో - మిగతా 2 లో

# హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం




- ట్రైనీ ఐపీఎస్ పై కేసు
- హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో దారుణ ఘటన
- మహిళా ఐపీఎస్ ట్రైనీపై లైంగిక వేధింపులకు పాల్పడిన సహోద్యోగి
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- కత్తితో బెదిరించి, అభ్యంతరకర వీడియోలు తీశాడని బాధితురాలి ఫిర్యాదు
- బాధితురాలి భర్తకే ఆ వీడియోలను పంపినట్లు ఆరోపణలు

**హైదరాబాద్ :**

దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి మహిళా - మిగతా 2 లో




## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్
- క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
- తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు

**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని పేదల సొంతింటి కలను నిజం చేయబోతున్నట్లు గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'క్యూర్' పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు - మిగతా 2 లో

# గాంధీభవన్‌కు రావొద్దు.. నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!

- ఎస్ఐఆర్‌పై రేవంత్ కఠిన ఆదేశాలు
- ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన
- గాంధీభవన్‌కు రావొద్దన్న సీఎం
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- ఉత్తమ 100 బీఎల్ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ



**హైదరాబాద్ :**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్‌పై నేడు నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్ దూసిన వీసా కత్తి!

మితవాద రాజకీయం ఊరకే ఉండదు. నిరంతరం కొత్త శత్రువుల్ని వెదుక్కుంటుంది. తన చర్యల పర్యవసానంగా పుట్టుకొచ్చే సంక్షోభాలనుంచి జనం దృష్టి మరల్చడానికి నానా తంటాలూ పడుతుంది. ఆ రాజకీయంలోనే పుట్టి, దాన్ని మరింత దిగజార్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండో దఫా వచ్చాక వలసలపై కత్తిగట్టారు. అమెరికాలో చదువుకోవటానికొచ్చినవారు గరిష్ఠంగా నాలుగేళ్లకు మించి ఉండటానికి వీల్లేదంటూ తాజాగా తీసుకురావాలనుకుంటున్న నిబంధన ఆ పరంపరలో భాగమే. ఇతరేతర వీసాల సంగతి సరేసరి. ప్రపంచ దేశాల్లోని వారందరికీ ఉన్నత చదువుల గమ్యస్థానం అమెరికాయే. అక్కడ చదువుకుంటే సాఫ్ట్‌వేర్, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో మెరుగైన జీతాలతో కొలువులొస్తాయన్న నమ్మకమే అందుకు కారణం. అయితే ట్రంప్ తీసుకున్న కొత్త నిర్ణయంవల్ల విద్యార్థులకు మాత్రమే కాదు... అక్కడి విద్యాలయాలు, టెక్ రంగ సంస్థలకు కూడా సమస్యలొస్తాయి. విద్యాలయాల వేల కోట్ల ఆదాయం పడిపోతే, టెక్‌రంగ సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడుతుంది. ఎందుకంటే స్థానికులతో పోలిస్తే విదేశాలనుంచి వచ్చే విద్యార్థులు చదువుల్లో, తెలివితేటల్లో చాలా ముందంజలో ఉంటారు. డిగ్రీ చదువులకొచ్చేవరకూ స్వదేశీయులకు అంతా ఉచితమే అయినా, అటుపై తడిసిమోపెడవుతుంది. వారితో పోలిస్తే నిజానికి విదేశీ విద్యార్థులు రెండు మూడు రెట్లు అధికంగా చెల్లించాలి. ఆ మొత్తంతోనే స్థానికులకు స్కాలర్‌షిప్‌లిస్తారు. వారినుంచి తక్కువ ఫీజు వసూలు చేస్తారు. స్థానికులు హ్యూమనిటీస్, ఆర్ట్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, లా తదితర కోర్సుల్లో ఆసక్తి కనబరుస్తారు. సాంకేతిక రంగంలో దూసుకెళ్లే అమెరికాకు 'స్టెమ్'(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) విభాగంలో నిపుణులు అవసరం. విదేశీయులు కఠినమైన వడపోత తర్వాత ఆ కోర్సులు చదవడానికి వెళ్లినవారు గనుక ఆ కోర్సులను సులభంగా ఆకళింపు చేసుకుంటారు. స్టెమ్ కోర్సుల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ స్థాయిలో 70 శాతం సీట్లు విదేశీయులకే లభించటం ఇందుకే. స్థానికుల్ని వారితో పోటీపడేలా తీర్చిదిద్దటానికి తాము చేయాల్సిందేమిటన్న దృష్టి ట్రంప్‌కుగానీ, ఆయన ముందున్న పాలకులకుగానీ లేదు. తగినంతమంది సాంకేతిక నిపుణులు స్థానికంగా లభ్యంకాకపోవటంవల్లనే అమెరికా దిగ్గజ టెక్ సంస్థలు విదేశాలనుంచి వచ్చేవారిని ఎంపిక చేసుకోవాల్సివస్తున్నది. అలా భర్తీ చేసుకోనట్టయితే ఇన్నోవేషన్ రంగంలో ఆ దేశం వెనకబడిపోతుంది. అదిగాక విదేశీ విద్యార్థులు చెల్లించే వేలాది కోట్ల డాలర్ల ఫీజులు, టెక్ సంస్థల విస్తరణ, లాభార్జనల వల్ల మరిన్ని వేలకోట్ల డాలర్లు పన్నుల రూపంలో ఖజానాకు సమకూరుతాయి. ఇతరత్రా సంస్థల సంగతలావుంచి మన భారత సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కార్పొరేట్ పన్ను రూపంలోనే నిరుడు 867 కోట్ల డాలర్లు (రూ. 73,000 కోట్లకు పైగా) చెల్లించాయి. మొత్తంగా అన్ని సంస్థలూ 13,008 కోట్ల డాలర్లకు పైగా (రూ. 10,99,166 కోట్న?లపైగా) చెల్లించాయి. ఇవిగాక జీఎస్‌టీ, కస్టమ్స్ సుంకం, ఉద్యోగులు చెల్లించే టీడీఎస్‌లు అదనం. ఇంతగా లాభపడుతూ బాధిత దేశంగా శోకించటం అమెరికాకే చెల్లింది. వీసా వ్యవస్థ దశాబ్దాలుగా దుర్వినియోగమవుతున్నదనీ, దేశ భద్రత ప్రమాదంలో పడిందనీ గొంతుచించుకుంటున్న అమెరికా తాను ఎడాపెడా వర్ధమాన, వెనకబడిన దేశాలనుంచి దశాబ్దాలుగా కొల్లగొడుతున్న సంపద గురించి మాట్లాడదు. ఇందులో ఆ దేశాల పాలకుల తప్పు కూడా ఉంది. మన దేశం సంగతే తీసుకుంటే 2047 కల్లా 'వికసిత్ భారత్' తీసుకొస్తామంటారు. కానీ అమెరికా మాదిరిగా కనీసం డిగ్రీవరకూ ఉచిత విద్య, నామమాత్రపు ఫీజులతో ఆపై విద్య అందుబాటులోకి తెచ్చే ఆలోచన చేయరు. జీడీపీలో కనీసం 6 శాతం విద్యకు వ్యయం చేయాలన్న లక్ష్యం పాటించరు. హైస్కూల్ విద్యవరకూ శ్రద్ధ పెడుతున్నట్టు కనబడుతూ ఆపై చదువుల్ని కార్పొరేట్లకు వదిలేశారు. వేలాదిమంది ప్రొఫెసర్ల కొరతతో విశ్వవిద్యాలయాలు దయనీయ స్థితిలో పడినా పట్టదు. కొలువుల సంగతి సరేసరి. ఇలాంటి స్థితిలో ట్రంప్ బెదిరిస్తే, పరిమితులు విధిస్తే నిస్సహాయంగా మిగలటం తప్ప మన యువత చేయగలిగేది ఏముంది?



## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

**మొదటిపేజీ తరువాయి** - కొణిదెల, దయకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం

**మొదటిపేజీ తరువాయి** - బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది. మరోవైపు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో బాలికను వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో కూడా నెగటివ్ అని నిర్ధారణ అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి జులై 16 మధ్య కాలంలో మొత్తం 12 కోవిడ్ కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి. మరణించిన వారంతా రక్తపోటు, మధుమేహం, కిడ్నీ వ్యాధుల వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారేనని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి కేసుల వ్యాప్తి తీవ్రంగా లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది.

## కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం.. సముద్రంపాలైన ముడిచమురు

**మొదటిపేజీ తరువాయి** - ఘటనతో సముద్ర జలాల్లోకి చమురు వేగంగా వ్యాపించడంతో పర్యావరణానికి వాటిల్లే నష్టంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే, పైప్‌లైన్ లీకేజీ కారణంగా భారీ పరిమాణంలో ముడి చమురు సముద్రపు నీటిలో కలిసిపోయింది. ఈ ఘటనపై పోర్టు యాజమాన్యం తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించింది. కాంట్రాక్టర్లు, అధికారులు మరియు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ నిర్వహణ లోపం తలెత్తి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. తూర్పు తీరంలో అత్యంత కీలకమైన ప్రైవేట్ డీప్-వాటర్ పోర్టుగా ఉన్న కృష్ణపట్నం నుంచి ముడి చమురు, వంట నూనెల వంటి ద్రవ సరకు రవాణా భారీ స్థాయిలో జరుగుతుంది. నిబంధనల ప్రకారం, ఈ పోర్టు ఇండియన్ కోస్ట్ గార్డ్ సహకారంతో టైర్-1 ఆయిల్ స్పిల్ స్పందన సామర్థ్యాలను కలిగి ఉంది.

## పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

**మొదటిపేజీ తరువాయి** - పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు మరో మలుపు తిరిగాయి. జోర్డాన్ సరిహద్దుల్లో ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ల దాడిని తిప్పికొట్టే క్రమంలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అధికారికంగా ధ్రువీకరించింది. జులై 17న జరిగిన ఈ దాడిలో మరొక అమెరికా సైనికుడు గల్లంతయ్యాడని, నలుగురు తీవ్రంగా గాయపడ్డారని పెంటగాన్ తెలిపింది. ఈ తాజా మరణాలతో ఈ యుద్ధంలో ఇప్పటివరకు చనిపోయిన అమెరికా సైనికుల సంఖ్య 16కు చేరగా, 430 మందికి పైగా గాయపడ్డారు. ఈ పరిణామాల మధ్య, ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "అమెరికా శత్రువు యుద్ధాన్ని ప్రేరేపిస్తూ, దాని పర్యవసానాలను ఎదుర్కొంటోంది. ఇరాన్ దేశం , దాని మద్దతు దళాలు (యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్) అమెరికాకు మరచిపోలేని పాఠాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన ఏ ఒప్పందమైనా 'నిరుపయోగం.. చెల్లనిది' అని ఆయన కొట్టిపారేశారు.

# "ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు"

**మొదటిపేజీ తరువాయి** - పౌర స్మృతి బిల్లు, 2026కు ఏకగ్రీవంగా, హృదయపూర్వకంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా నా కేబినెట్ సహచరులకు, మీ అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. రాజ్యాంగబద్ధమైన సమానత్వానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ బిల్లు చారిత్రక భారతీయ సంస్కృతికి, విలువలకు కట్టుబడి ఉంది. జులై 20 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో ఈ యూసీసీ బిల్లును ప్రవేశపెడతాం."

### ప్రజల మద్దతుతోనే!

ఉమ్మడి పౌర స్మృతికి ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోందని, రాష్ట్ర జనాభాలో 93 శాతం కంటే ఎక్కువ మంది ఈ చట్టానికి మద్దతు ఇస్తున్నారని సీఎం మోహన్ యాదవ్ అన్నారు. ముస్లిం సమాజం నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన డేటాను ప్రస్తావిస్తూ, ఆ సమాజంలోని మెజారిటీ మహిళలు ఈ యూసీసీ చట్టానికి అనుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "మా డేటా ప్రకారం, 80 శాతం మంది ముస్లిం మహిళలు, 40 శాతం ముస్లిం పురుషులు ఒకే విధమైన ఉమ్మడి చట్టం ఉండాలని విశ్వసిస్తున్నారు. మాకు 3 కోట్ల సందేశాలు (రామీా) వచ్చాయి. మేము ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజాభిప్రాయాన్ని సేకరించాం. నేను స్వయంగా వివిధ ర్యాలీలు, సభల ద్వారా ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను కోరాను. ఏప్రిల్ 24న ఒక ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అందరి నుంచి సూచనలను ఆహ్వానించాం. యూసీసీ ఇప్పటికే అమలులో ఉన్న రాష్ట్రాలపై కూడా మేము అధ్యయనం చేశాం. మాకు మొత్తం 9.58 లక్షల సూచనలు వచ్చాయి. రాష్ట్రంలోని 93.54 శాతం మంది ప్రజలు ఈ చట్టానికి మద్దతు ఇచ్చారు" అని సీఎం మోహన్ యాదవ్ అన్నారు. సమాజంలోని వివక్షను తొలగించడానికి, అన్ని వర్గాలను ఒకే చట్టపరమైన ఛత్రం కిందికి తీసుకురావడానికి ఈ యూసీసీ చట్టాన్ని రూపొందించినట్లు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పష్టం చేశారు. "సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభించేలా చూస్తామని మేము సంకల్పం తీసుకున్నాం. అది రామ్ అయినా, రహీమ్ అయినా, రవీందర్ అయినా, రాబిన్ అయినా- ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలి" అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌పై విమర్శలు

"కమిటీ ముందు బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్ష పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. కానీ ప్రతి అంశాన్ని హిందూ-ముస్లిం, ఓటు బ్యాంకు రాజకీయాల కోణంలో చూసే కాంగ్రెస్ మాత్రం తన అభిప్రాయాలు చెప్పకుండా దూరంగా ఉంది" అని ముఖ్యమంత్రి విమర్శించారు. వివాహం, సహజీవనం, దత్తత, సరోగసీ, ఏఆర్‌టీ ద్వారా జన్మించిన పిల్లలందరికీ ఈ చట్టం సమాన చట్టపరమైన హోదాను కల్పిస్తుందని యాదవ్ పేర్కొన్నారు.

### గిరిజనులకు మినహాయింపు

మధ్యప్రదేశ్‌లో యూసీసీ ముసాయిదాను రూపొందించడానికి ప్రభుత్వం నియమించిన కమిటీకి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం వహించారు. ఈ కమిటీ ఇటీవల ముఖ్యమంత్రికి తన నివేదికను సమర్పించింది. షెడ్యూల్ తెగలను (ఆదివాసీలను) దీని పరిధి నుంచి మినహాయించాలని ఈ నివేదిక సిఫారసు చేసింది. దీనితో ఈ ఉమ్మడి పౌర స్మృతి ముసాయిదా బిల్లులో గిరిజన వర్గాన్ని మినహాయించారు. ఈ ప్రతిపాదిత బిల్లులో వివాహం, విడాకులు, భరణం, వారసత్వం, సహజీవనం, దత్తత, వారసత్వం వంటి పలు అంశాలను చేర్చారు. ఈ బిల్లు ప్రకారం, ఇకపై వివాహ నమోదు తప్పనిసరి. పురుషులకు వివాహ వయస్సు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు నిండాలి. మహిళా సాధికారత, సామాజిక సామరస్యం, జాతీయ ఐక్యతను బలోపేతం చేసే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ బిల్లుకు, రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని అన్ని పార్టీలకు సీఎం పిలుపునిచ్చారు.

# మార్స్‌లో గ్రహాంతరవాసులు కాదు.. మన బ్యాక్టీరియాలే మనకు ముప్పా?

**మొదటిపేజీ తరువాయి** -

అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. అక్కడి తీవ్ర వాతావరణానికి అలవాటు పడే క్రమంలో కొన్ని బ్యాక్టీరియా మరింత ప్రమాదకరంగా మారవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. మన శరీరంలో సహజంగా ఉండే కొన్ని బ్యాక్టీరియాల గురించే ఈ అధ్యయనం సాగింది. అంగారకుడిపై తీవ్ర అతినీలలోహిత కిరణాలు, గడ్డకట్టే ఉష్ణోగ్రతలు, అత్యల్ప వాయు పీడనం, విషపూరిత పెర్క్లోరేట్ లవణాలు వంటి పరిస్థితులు ఉంటాయి. అలాంటి ఒత్తిడిలో కొన్ని బ్యాక్టీరియాలు తమ స్వభావాన్ని మార్చుకుని మరింత బలంగా మారే అవకాశం ఉందని పరిశోధన సూచిస్తోంది. ఈ అధ్యయనాన్ని స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త టొమాసో జక్కారియా నిర్వహించారు. సాధారణ పరిస్థితుల్లో మనుషులకు ఇన్‌ఫెక్షన్లు కలిగించే నాలుగు రకాల బ్యాక్టీరియాలను ఎంపిక చేశారు. వాటిపై మార్స్‌ను పోలిన వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి పరీక్షలు నిర్వహించారు. తక్కువ గాలి పీడనం, తీవ్రమైన ఎండ, అధిక అతినీలలోహిత కిరణాలు, పెర్క్లోరేట్ లవణాలతో కూడిన పరిస్థితుల్లో వాటి ప్రవర్తనను పరిశీలించారు. చాలా బ్యాక్టీరియా కొద్ది గంటల్లోనే నశించినా.. కొన్ని మాత్రం ఊహించిన దానికంటే ఎక్కువసేపు మనుగడ సాగించాయని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఎండిపోయిన పరిస్థితుల్లో కొన్ని రెండు వారాలకుపైగా జీవించాయి. ఒకవేళ ఇవి వ్యోమగాముల నివాస కేంద్రాల్లోకి చేరితే అక్కడ ఉండే అనుకూల వాతావరణంలో మరింత వేగంగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలను ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం బ్యాక్టీరియా మనుగడ కాదు.. వాటిలో వచ్చే మార్పులు. తీవ్ర ఒత్తిడి పరిస్థితుల్లో కొన్ని సూక్ష్మజీవులు మరింత విషపూరితంగా మారడం, యాంటీబయోటిక్ మందులకు తట్టుకునే సామర్థ్యం పెరగడం, రక్షణ పొరలు ఏర్పరచుకోవడం వంటి మార్పులు భూమిపై ఇప్పటికే గుర్తించారు. మార్స్ ప్రయాణాలు నెలలు, సంవత్సరాలు కొనసాగితే ఇలాంటి మార్పులు మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని అధ్యయనం చెబుతోంది. అంతరిక్షంలో ఎక్కువకాలం గడిపిన వ్యోమగాముల్లో రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుందని గత పరిశోధనలు వెల్లడించాయి. అదే సమయంలో బ్యాక్టీరియా మరింత బలపడితే ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే భవిష్యత్ మార్స్ యాత్రల్లో వ్యోమగాముల ఆరోగ్యంతో పాటు వారి శరీరంలోని సూక్ష్మజీవులను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. అయితే ఇవన్నీ ఇప్పటికైతే అవకాశాల స్థాయిలో ఉన్న అంశాలేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మార్స్‌పై గ్రహాంతర సూక్ష్మజీవులు ఉన్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ భవిష్యత్ అంతరిక్ష యాత్రలను మరింత సురక్షితంగా నిర్వహించాలంటే ఇలాంటి ప్రమాదాలపై ముందుగానే పరిశోధనలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

# ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు

**మొదటిపేజీ తరువాయి** - పదజాలం వాడడం మాత్రమే ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు" అని పేర్కొంది. "ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తించేదిగా ఉండాలి. దానిని వినే లేదా చూసే వారి మనస్సులను భ్రష్టు పట్టించేలా, చెడగొట్టేలా ఉండాలి. ఈ ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తే, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలన్నీ నిజమేనని పూర్తిగా అంగీకరించినప్పటికీ, ఆ మాటలను అశ్లీలమైనవిగా పరిగణించలేము. ఇలాంటి మాటలు ఎంత దూషణతో కూడినవి, వినడానికి వీలులేనివి లేదా సభ్యత లేనివి అయినప్పటికీ, ఇవి ఐపీసీ సెక్షన్ 294 (బి) పరిధిలోకి రావు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఈ బూతు మాటలు, అసభ్య పదజాలం వాడకం వల్ల బహిరంగ ప్రదేశంలో ఇతరులకు, ముఖ్యంగా ఫిర్యాదుదారునికి తీవ్ర అసౌకర్యం లేదా ఇబ్బంది కలిగిందని ఎక్కడా రుజువు కాలేదు. ఈ సెక్షన్‌కు ఇది అత్యంత కీలకమైన నిబంధన. ఇది లేనప్పుడు, ఐపీసీ సెక్షన్ 294 (బి) కింద నేరం జరిగినట్లు పరిగణించలేము" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

### కేసు నేపథ్యం

తమిళనాడులో 2017 ఆగస్టులో ఒక వ్యవసాయ భూమి గురించి వివాదం చెలరేగింది. ఆ సమయంలో పిటిషనర్‌కు, అతడి బావమరిదికి మధ్య వాగ్వాదం జరిగింది. రెండు రోజుల తర్వాత, అదే భూమి విషయమై మేనల్లుడితో పిటిషనర్ మళ్లీ గొడవ పడ్డాడు. దీనితో ఆయన బావమరిది జోక్యం చేసుకున్నాడు. కోపంతో పిటిషనర్ తన బావమరిదిని అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించాడు. దీనితో ట్రయల్ కోర్టు ఐపీసీ సెక్షన్ 294 (బి) అశ్లీలత, సెక్షన్ 326 (తీవ్రంగా గాయపరచడం), 506 (ఐఐ) (క్రిమినల్ బెదిరింపు)తో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద దోషిగా తేల్చింది. దీనితో పిటిషనర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. మద్రాస్ హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఆరోపణల నుంచి పిటిషనర్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. కానీ ఐపీసీ సెక్షన్ల కింద విధించిన శిక్షలను మాత్రం సమర్థించింది. ఈ నేపథ్యంలోనే సదరు పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

### పోక్సో దుర్వినియోగం


మరో కేసు విచారణ సందర్భంగా, పరస్పరం ప్రేమించుకున్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. యుక్త వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (ాజూూా) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైనదేనా అని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన కేసును సుమోటోగా విచారణ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు వ్యాఖ్యానించింది.

# గాంధీభవన్‌కు రావొద్దు.. నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!



**మొదటిపేజీ తరువాయి** - విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. ఛైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు. బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

## హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం




**మొదటిపేజీ తరువాయి** - ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న తీవ్ర ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే, అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ఐపీఎస్ ప్రొబేషనర్, తన సహోద్యోగి అయిన ఉదయ్ కృష్ణారెడ్డి తనను కొంతకాలంగా వేధిస్తున్నాడని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తనకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో జూలై 9న నిందితుడు తనను బలవంతంగా ఒక గదిలోకి లాక్కెళ్లాడని, జుట్టు పట్టుకుని మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, ఆమె ప్రైవేట్ వీడియోలను బలవంతంగా చిత్రీకరించి, ఆమె మొబైల్ ఫోన్ లాక్కుని, ఆ వీడియోలను ఆమె భర్త వాట్సాప్‌కు పంపాడని ఫిర్యాదులో వివరించారు. బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన అత్తాపూర్ పోలీసులు, నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66(జ) కింద కేసు నమోదు చేశారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం




**మొదటిపేజీ తరువాయి** - సోమవారం శ్రీకారం చుట్టబోతున్నట్లుగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను సోమవారం విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో తొలివిడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల విలువైన ప్రాంతాలను గుర్తించినట్లుగా వివరించారు. అధునాతన సౌకర్యాలతో పది అంతస్తుల భవనాల నిర్మాణం చేపట్టి పేదలకు అందిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుందని వివరించారు. రెండో విడతలో ప్రకటించిన 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా నగరంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా సాకారం చేయబోతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గతేడాది మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో రెండు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, లక్షలాది కుటుంబాలు ఇప్పటికే గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని, గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# కర్నూలులో 'ఫ్రాంక్విన్' ఆధ్వర్యంలో ఎయిర్ హోస్టెస్ ఉచిత కెరీర్ కౌన్సిలింగ్

## విమానయాన రంగంలో ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన

**కర్నూలు ప్రతినిధి, జూలై 19, ( సీమకిరణం న్యూస్):** విమానయాన, హాస్పిటాలిటీ, ట్రావెల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉన్న విస్తృత ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ప్రముఖ శిక్షణా సంస్థ ఫ్రాంక్విన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎయిర్ హోస్టెస్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరంలో ఉచిత కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. బళ్లారి రోడ్డులోని హోటల్ సైన్ రీజెన్సీలో జరిగిన ఈ కార్యక్రమానికి నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, దీంతో ఎయిర్ హోస్టెస్, క్యాబిన్ క్రూ, గ్రౌండ్ స్టాఫ్, కస్టమర్ సర్వీస్ తదితర విభాగాల్లో విస్తృత ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపర్చుకుని, తగిన శిక్షణ పొందితే ఈ రంగంలో మంచి కెరీర్‌ను నిర్మించుకోవచ్చని వివరించారు. కౌన్సిలింగ్‌కు హాజరైన విద్యార్థుల విద్యార్హతలు, ఆసక్తులను బట్టి వారికి అనువైన కోర్సులపై నిపుణులు వ్యక్తిగతంగా మార్గనిర్దేశం చేశారు. ఫ్రాంక్విన్ అందిస్తున్న డిప్లొమా, అడ్వాన్స్‌డ్ కోర్సులు, శిక్షణ కాలపరిమితి, అంతర్జాతీయ గుర్తింపు వంటి అంశాలను సవివరంగా వివరించారు. అలాగే కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు దేశీయ, అంతర్జాతీయ విమానయాన సంస్థల్లో లభించే ప్లేస్‌మెంట్ అవకాశాలు, గతంలో ఎంపికైన విద్యార్థుల విజయగాథలను కూడా ప్రతినిధులు వివరించారు. ఇటువంటి కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమాలు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంలో, భవిష్యత్ కెరీర్‌పై స్పష్టత పొందడంలో ఎంతో ఉపయోగపడుతున్నాయని హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.




# ఆత్మహత్యకు యత్నించిన ఎంబీఏ విద్యార్థిని

## సమయస్ఫూర్తితో స్పందించిన పోలీసులు

## విద్యార్థినిని ప్రాణాలతో కాపాడిన కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు



**కర్నూలు క్రైమ్, జూలై 19, (సీమకిరణం న్యూస్) :** పెళ్లి ఇష్టం లేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన ఓ ఎంబీఏ విద్యార్థినిని కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాలతో కాపాడారు. పోలీసుల వివరాల ప్రకారం, నంద్యాల జిల్లా డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన నాగశంకర్, విజయకుమారి దంపతుల కుమార్తె సుదర్శనమ్మ (24) చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. అనంతరం కర్నూలులోని పోలీస్ కాలనీలో నివసిస్తున్న తన తాత బూరుగుల సత్యరాజు వద్ద పెరిగి, ఎంబీఏ పూర్తి చేసింది. ఇటీవల కుటుంబ సభ్యులు ఆమెకు వివాహ సంబంధాలు చూడగా, ఉద్యోగం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని సుదర్శనమ్మ చెబుతూ వచ్చింది. అయితే రెండు రోజుల క్రితం పెళ్లిచూపులకు కొందరు వస్తున్నారని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె, శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో వాగ్వాదం అనంతరం ఇంటి నుంచి వెళ్లిపోయింది.

**టవర్ లోకేషన్‌తో గుర్తించిన పోలీసులు**

మనవరాలు కనిపించకపోవడంతో తాత సత్యరాజు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ విక్రమ సింహ ఆదేశాల మేరకు సెక్టార్ ఎస్సై శరత్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి విద్యార్థిని మొబైల్ టవర్ లోకేషన్‌ను గుర్తించారు. ఆమె ఎన్‌హెచ్-44 పంచలింగాల సమీపంలోని తుంగభద్ర నది బ్రిడ్జి కింద గంగమ్మ గుడి మెట్ల వద్ద ఆత్మహత్యకు యత్నిస్తుండగా పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని సురక్షితంగా రక్షించారు.

**కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగింత**

విద్యార్థినిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులు, జీవితం ఎంతో విలువైనదని, సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమెను సురక్షితంగా తాత సత్యరాజుకు అప్పగించారు. సమయానికి స్పందించి తన మనవరాలి ప్రాణాలను కాపాడిన సీఐ విక్రమ సింహ, ఎస్సై శరత్ కుమార్ రెడ్డి మరియు పోలీసు సిబ్బందికి తాత సత్యరాజు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల తక్షణ స్పందనను స్థానికులు అభినందిస్తున్నారు.

# 'తల్లికి వందనం' ఆశ చూపి దోచేస్తారు

## నకిలీ లింకులతో జాగ్రత్త

## కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరిక

**కర్నూలు క్రైం, జూలై 19, (సీమకిరణం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపే అవకాశం ఉందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని నకిలీ లింకుల ద్వారా ఖాతాలు ఖాళీ చేసే ప్రమాదం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులు, అర్హత జాబితాలు, ఖాతాల్లో నగదు జమ తదితర అంశాల పేరుతో వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా వేదికగా అనుమానాస్పద లింకులు వచ్చే అవకాశం ఉందన్నారు.

**ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు పంచుకోవద్దు..**

తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. అటువంటి లింకుల ద్వారా సైబర్ ముఠాలు బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ నంబర్, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీలు (ఊూ), పాస్‌వర్డ్‌ల వంటి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి ఆర్థిక మోసాలకు పాల్పడతారని వివరించారు. లబ్ధిదారులు కేవలం ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని పిలుపునిచ్చారు.

**సచివాలయాలనే సంప్రదించాలి..**

పథకానికి సంబంధించిన ఎలాంటి సందేహాలున్నా అధికారిక ప్రభుత్వ వేదికలను లేదా సంబంధిత స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు సచివాలయ కార్యాలయాలను, అధికారులను మాత్రమే సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

**బాధితులు 1930 కి కాల్ చేయండి:**

ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే 1930 జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లేదా www. cybercrime .gov.in వెబ్‌సైట్ ద్వారా గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గానీ ఫిర్యాదు నమోదు చేయవచ్చని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.



# అంగన్‌వాడీలకు తక్షణమే వేతనాలు పెంచాలి.




## లేదంటే ఆందోళనలు ఉధృతం



**వెల్దుర్తి, జూలై 19, (సీమ కిరణం న్యూస్):** అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వేతనాలను గౌరవప్రదంగా పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలోని గొల్లపూడిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం అందుతున్న తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందిపై నిరంతరం అదనపు పనుల భారం మోపుతున్నప్పటికీ, అందుకు తగిన వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాల కల్పన, ఖాళీ పోస్టుల భర్తీ, అదనపు పనుల భారం తగ్గింపు వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# అభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎన్నారై అనిల్ కుమార్ గౌడ్





## ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ

**వెల్దుర్తి, జూలై 19, (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎన్నారై అనిల్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడంతో పాటు, ఆలయానికి షామియానాను విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమైన అనిల్ కుమార్ గౌడ్, ఆలయ అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు యాత్రికుల కోసం విశ్రాంతి గదులు, సత్రం నిర్మాణం వంటి అవసరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అనిల్ కుమార్ గౌడ్, ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అనంతరం అనిల్ కుమార్ గౌడ్ వెల్దుర్తిలోని ఏబీఎన్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వెల్దుర్తి ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# సత్ప్రవర్తనతో మెలగాలి

## ఎస్సై అనిల్ కుమార్



**ప్యాపిలి, జూలై 19 (సీమ కిరణం న్యూస్) :** రౌడీ షీటర్లు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగుతూ చట్టాలను గౌరవించాలని ఎస్సై అనిల్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని జలదుర్గం పోలీస్ స్టేషన్ అవరణలో ఎస్సై అనిల్ కుమార్ వారి సిబ్బందితో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, నేరాలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా జీవనం సాగించాలని సూచించారు. కుటుంబ సభ్యులతో సఖ్యతగా ఉంటూ సమాజంలో మంచి పేరు సంపాదించుకునేలా ప్రవర్తించాలని తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి ఆదర్శ పౌరులుగా నిలవాలని ఎస్సై అనిల్ కుమార్ కోరారు.

# ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో క్యాన్సర్ పేషెంట్ మాధవికి అంత్యక్రియలు





**డోన్ టౌన్, జూలై 19,(సీమ కిరణం న్యూస్):** డోన్ వైయస్ నగర్ లో సిమోను చర్చి పక్కన 10 సంవత్సరాల నుండి నివసిస్తున్న మాధవి(36 సంవత్సరాలు) అనే ఆమె క్యాన్సర్ కారణంగా నిన్న సాయంత్రం చనిపోగా ఆమె అంత్యక్రియలు చేయడానికి తనకు సంబంధించిన బంధువులు ఎవరూ లేరని కాలనీ వాసులు తనకి అంతక్రియలు నిర్వహించండి అని ద్రోణాచలం సేవాసమితి ని కోరగా స్పందించిన సేవా సైనికులు మృతదేహనికి హిందూ సంప్రదాయ పద్ధతిలో డోన్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది .ఈ అంత్యక్రియలకు అయిన ఖర్చును డోన్ కు చెందిన హైకోర్టు లాయరు రేవన్ గౌడ్ భరించారు, వైకుంఠ రథాన్ని రాజయ్య గౌడ్ ఉచితంగా సమకూర్చారు .ఈ కార్యక్రమంలో ద్రోణాచలం సేవా సైనికులు షాది ఖానా రాజా, గురుస్వామి,తాహేర్ బాషా, మెకానిక్ వెంకటేష్,బ్రాహ్మయ్య మరియు సి.పి.ఐ మండల కార్యదర్శి నారాయణ లు పాల్గొన్నారు.

# డోన్ లో ఆర్పిఎఫ్ స్టేషన్ ను అకస్మాతిగా తనిఖీ చేసిన రైల్వే ఐ జి అంజన్ కుమార్ సింగ్



**డోన్ టౌన్, జూలై 19,(సీమ కిరణం న్యూస్):** డోన్ ఆర్పిఎఫ్ స్టేషన్ ను ఆదివారం రైల్వే ఐజి అంజని కుమార్ సింగ్ తనిఖీ చేశారు. రైల్వే శాఖకు చెందిన పది లక్షల విలువైన 1300 కిలోల రాగి జంపర్ల అక్రమ తరలింపుకు సంబంధించిన కేసు దర్యాప్తు పురోగతిని రైల్వే ఐజి అంజని కుమార్ సింగ్ సమీక్షించారు. ఇప్పటికే కొంత రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకున్నామని మిగిలిన ఆస్తిని రికవరీతోపాటు కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వివరించారు. ఈ దర్యాప్తు ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో గుంతకల్లు క్రైమ్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ వారి సహకారంతో కొనసాగుతుందని తెలిపారు. రైల్వే ఆస్తుల రక్షణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అప్రమత్తంగా పనిచేయాలని భద్రత ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని ఐజి అంజనీ కుమార్ సింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇన్స్పెక్టర్ నాగభూషణం, పట్టణ సీఐ ఇంతియాజ్ భాష, ఆర్ పి ఎస్ ఐ మాధవిలను సన్మానించారు.


# శక్తి యాప్ పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం






**డోన్ టౌన్, జూలై 19,(సీమ కిరణం న్యూస్):** నంద్యాల జిల్లా ఎస్పీ డిఎస్పీల ఆదేశాల మేరకు డోన్ శక్తి టీం పట్టణ సీఐ ఇంతియాజ్ భాషా ఆధ్వర్యంలో పాతపేట బీసీ హాస్టల్ నందు విద్యార్థినిలకు మరియు మహిళలకు శక్తి యాప్ గురించి వివరిస్తూ ప్రస్తుతం మహిళలపై సమాజంలో జరిగే అత్యాచారాలు, మహిళల పట్ల ఇతరుల దురుసు ప్రవర్తన ల గురించి వెంటనే 112 లేదా 100 కు ఫోన్ చేసి తెలపవచ్చునని, బాల్యవివాహాలు చేస్తున్నట్లుగా తెలిసినా 1098కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఏపీకే ఫైల్స్ మరియు ఫేక్ మెసేజ్లు వంటి సైబర్ నేరాలకు 1930 నెంబర్ కు సమాచారం ఇవ్వవలని అవగాహన కల్పించారు.

## వానొస్తే కరెంట్ కట్.. గ్రేటర్‌లో నిత్యకృత్యంగా మారిన విద్యుత్ కోతలు



'మణికొండ, పుప్పాలగూడ, డైమండ్‌హిల్స్ ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంది. హెచ్చు తగ్గులతో సరఫరా అవుతుండటంతో ఇంట్లోని గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా స్పందన లేదు.' అని మణికొండకు చెందిన విద్యుత్ వినియోగదారుడు అనిల్ మల్లాడి ఆదివారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు.ఇలా ఒక్క మణికొండ ప్రాంతంలోనే కాదు.. గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం అనేది నిత్యకృత్యంగా మారింది. వర్షం వస్తుందంటే చాలు %ొ% కరెంటు పోతుందన్న భయం నగరవాసులను వెంటాడుతూనే ఉన్నది. పది రోజుల నుంచి కురుస్తున్న వానలతో నగరంలో చాలా చోట్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఇటీవల మధురానగర్ డీ బ్లాక్ ప్రాంతంలో ఏకంగా 28 గంటల పాటు సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## చైనాలో మరో భయాంకర వైరస్ గుర్తింపు మెదడుపైనే ఎఫెక్ట్!



చైనాలో మరో కొత్త రకం వైరస్ బయటపడింది. వెట్‌ల్యాండ్ అని పిలవబడే అత్యంత ప్రమాదకరమైన వైరస్‌ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మెదడు, నాడీ సంబంధిత వ్యాధులకు ఇది కారణమవుతుందని గుర్తించారు. ఈ వెట్‌ల్యాండ్ వైరస్‌ను తొలుత 2019లో గుర్తించారు. మంగోలియాలోని చిత్తడి నేలకు చెందిన ఓ 61 ఏళ్ల వృద్ధుడు అప్పట్లో అనారోగ్యానికి గురయ్యాడు. ఐదు రోజుల పాటు జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయి. ఈ లక్షణాలు కాస్త అనుమానాస్పదంగా ఉండటంతో పరిశోధకులు అప్రమత్తమయ్యారు. సమీప ప్రాంతాల్లోని దాదాపు 14,600 జీవులను సేకరించి అధ్యయనం చేశారు. వీటిలో దాదాపు రెండు శాతం పరాన్న జీవుల్లో జన్యు పదార్థం ఉన్నట్లు గుర్తించారు.అలాగే మంగోలియా ప్రాంతంలోని 640 మంది అటవీ అధికారుల రక్త నమూనాలను సేకరించి పరిశోధకులు విశ్లేషించారు. అందులో 12 మందిలో ఈ రకమైన వైరస్ ఉన్నట్లు తేలింది. జ్వరం, మైకం, తలనొప్పి, వికారం, విరేచనాలు వంటి లక్షణాలను వారిలో గుర్తించారు. వీరిలో మెదడు, వెన్నెముక ద్రవంలో అధిక తెల్ల రక్త కణాల సంఖ్య కారణంగా ఒక రోగి కోమాలోకి వెళ్లాడు. అయితే చికిత్స తర్వాత వీరంతా కోలుకున్నారు. కానీ ఎలుకలపై ల్యాబ్‌ల్లో చేసిన ప్రయోగాల్లో ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుందని గుర్తించారు. ముఖ్యంగా మెదడు, నాడీ సంబంధిత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కనుగొన్నారు. తాజాగా ఈ అధ్యయానికి సంబంధించిన నివేదికను ది న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైంది.వెట్‌ల్యాండ్ వైరస్ అనేది క్రిమియన్ కాంగో హెమరేజిక్ ఫీవర్ గ్రూప్‌నకు చెందిన వైరస్. ఇది పరాన్న జీవుల ద్వారా వ్యాపిస్తుంది. పందులు, గొర్రెలు, గుర్రాల్లోనూ ఆర్ఎన్ఏ ఇది వరకే ఉన్నట్లు గుర్తించారు.

## ఆహారంతో ఆక్సిజన్






అత్యధిక స్థాయిలో యాంటిఆక్సిడెంట్లు లభించే పండ్లలో స్ట్రాబెర్రీలు ముందుంటాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించే వ్యాధికారక బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. వీటిలోని పాలీఫినాల్ సమ్మేళనాలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. స్ట్రాబెర్రీల్లో సమృద్ధిగా దొరికే విటమిన్ సి మూలకాలు.. శరీరంలోని పోషక లోపాలను సవరిస్తాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సినంత శక్తి లభించడంతోపాటు ఆక్సిజన్ స్థాయిలూ పెరుగుతాయి.

**మామిడి:** రుచిలోనే కాదు.. మనిషికి ఆరోగ్యాన్ని ప్రసాదించడంలోనూ మామిడి పండు రారాజే! మామిడి పండ్లలో 'బీటా కెరోటిన్' అనే పదార్థం ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది ఎంతో సాయపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి.. శరీరానికి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్ కూడా పెరుగుతాయి.


## గొప్ప స్నేహం

క్రీస్తు సందేశం



మన జీవితంలో ఓ మంచి స్నేహితుణ్ని సంపాదించుకోవడం చాలా కష్టతరం. ఈ స్వార్థ జగత్తులో, ఎవరి బతుకు వారిదే అన్నట్టున్న ఈ రోజుల్లో నిబద్ధత గలిగిన స్నేహితులు కనిపించడం అరుదైన విషయమే! మానవుడికి శుభం కలిగించే మంచి స్నేహం గురించి యోబు భక్తుడు చెబుతూ 'ఆయనతో సహవాసం చేసిన యెడల నీకు సమాధానం కలుగును ఆలాగున నీకు మేలు కలుగును' (యోబు, -22,:-21,) అని ప్రస్తావించాడు. దేవుడితో సహవాసమా? ఎంత గొప్ప భాగ్యం? దేవుడితోనే మాట్లాడుతూ, ఆయనతోనే ఆలోచిస్తూ, చర్చిస్తూ, అన్న పానీయాలు సేవిస్తూ ఆయనతోనే నిరంతరం నివసిస్తూ ఉండటం ఎంతటి అవకాశం!నిజమే ప్రభువుతో కలిసి నడిచిన వారికి, నిత్యం తిరిగిన వారికి అనుక్షణం ఆయన రక్షణ లభిస్తుంది. విడువక, ఎడబాయక మనల్ని కంటికి రెప్పలా కాచి కాపాడతాడు. అంతేకాదు 'నీవు నావాడవు' అని భరోసా ఇస్తాడు. అలా అనగలిగేది ప్రేమ, బాధ్యత ఉన్నవాడే. నీవు దాక్కునే స్థలంలో కూడా రక్షణ కవచంలా పక్షిరెక్కలా కాచి కాపాడే గొప్ప స్నేహితుడు దేవుడు. 'నేను నిన్ను విమోచించి యున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను.. నీవు నా సొత్తు' (యెషయా 43:1) వాక్యాలు.. గొప్ప స్నేహాన్ని చాటిచెబుతాయి.

## టెల్కోలకు ఊరట టెంప్లెట్స్, కంటెంట్ రిజిస్ట్రేషన్ కోసం గడువు పెంచిన ట్రాయ్




స్పామ్ కాల్స్, స్పామ్ మెసేజ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు టెలికం రెగ్యులరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్).. టెల్కోలకు మరొక నెల గడువు పొడిగించింది. వైట్ లిస్టెడ్ కానీ యూఆర్ఎల్స్, ఓటీటీ లింక్స్, ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీస్), కాల్ బ్యాక్ నంబర్లకు సంబంధించిన మెసేజ్‌లను నిలిపివేసే విషయమై టెలికం సంస్థలకు రిలీఫ్ కల్పించింది ట్రాయ్. టెలికం సంస్థలు %-% రిలయన్స్ జియో, భారతీ ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా- మెసేజ్ టెంప్లేట్స్, కంటెంట్‌లను ఈ నెల 31 లోపు రిజిస్టర్ చేసుకోవాలని ట్రాయ్ ఆదేశించింది. ఈ గడువు సరిపోదని, మరికొంత టైం పెంచాలని టెలికం సంస్థలు కోరారు.తాజాగా మరోమారు గడువు పొడిగించిన ట్రాయ్.. అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత గడువు పొడిగించేది లేదని తేల్చి చెప్పింది. టెంప్లెట్స్, కంటెంట్ రిజిస్టర్ కాకుంటే మొబైల్ ఫోన్ యూజర్లకు సందేశాలు పంపడం నిలిపివేస్తామని పేర్కొంది. స్పామ్ కాల్స్, సందేశాలను నివారించడానికి, కంటెంట్ లేదా టెంప్లెట్స్ రిజిస్టర్ చేసుకోవడానికి టెలికం కంపెనీలన్నీ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ బేస్డ్ టూల్స్ వినియోగించాల్సి ఉంటుంది. ట్రాయ్ వద్ద రికార్డులకు అనుగుణంగా లేని మెసేజ్ లను అక్టోబర్ నుంచి నిలిపివేస్తారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై వేటు?



హైదరాబాద్ మహానగరంలో హైడ్రా మొన్నటి నుంచి బీభత్సం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. పొద్దున లేస్తే చాలు హైడ్రా... కూల్చివేతలే టీవీ ఛానల్ లో కనిపిస్తున్నాయి.పేద దానికి ఆనే తేడాలు లేకుండా... ప్రతి ఒక్కరికి నోటీసులు ఇచ్చి మరి అక్రమంగా నిర్మించిన ఇండ్లను అలాగే ఫామ్ హౌస్ లను... ధ్వంసం చేస్తోంది హైడ్రా. 1974 జియోగ్రాఫికల్... మ్యాప్ ఆధారంగా చెరువులను మళ్లీ పునరుద్ధరించేందుకు హైడ్రాను తీసుకువచ్చారు. అయితే 1974 ప్రకారం చూసుకున్నట్లయితే.. చాలావరకు కట్టడాలు... చెరువులోనే జరిగాయి. దీంతో రేవంత్ రెడ్డి అన్నయ్య తిరుపతి రెడ్డి అలాగే నాగార్జున లాంటి వారు తప్పిదాలు చేసి ఎఫ్టిఎల్ పరిధిలో స్థలాలు అలాగే ఇండ్లు కొనుగోలు చేసి ఇప్పుడు అవమానాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అక్కినేని నాగార్జున %చీ% కన్వెన్షన్..ను ధ్వంసం చేశారు అధికారులు. రేవంత్ అన్న తిరుపతిరెడ్డి, మురళీమోహన్ లాంటి వారికి కూడా నోటీసులు ఇచ్చారు.అదే సమయంలో పేదవారికి సంబంధించిన ఇండ్లను కూడా ధ్వంసం చేస్తుంది హైడ్రా. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి కంటే... హైడ్రా కమిషనర్ రంగనాథ్ బాగా హైలైట్ అవుతున్నారు. ఈ తరుణంలోనే తెరపైకి కొత్త విషయం వచ్చింది. అతి త్వరలోనే రంగనాథ్.. ఆ పోస్టు నుంచి బదిలీ కాబోతున్నారట. ఆయన స్థానంలో ఓ డమ్మీ అధికారిని హైడ్రా కమిషనర్ చేయబోతున్నారట. అయితే హైడ్రా కూల్చివేతల వల్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి... వ్యతిరేకత వస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రహించిందని సమాచారం.అందుకే హైడ్రా పవర్సు తగ్గించేందుకు కమిషనర్ను మార్చుతున్నారట. ఇందులో భాగంగానే హైడ్రా తాజాగా కీలక ప్రకటన కూడా చేసింది. ఎఫ్టిఎల్ పరిధిలో ఉన్న నివాస గృహాలను అస్సలు కూల్చబోమని తెలిపింది. ఎఫ్ టి ఎల్ పరిధిలో ఇప్పుడు కడుతున్న కట్టడాలను మాత్రమే ధ్వంసం చేస్తామని ప్రకటన చేశారు రంగనాథ్. ఇక ఈ ప్రకటనతో త్వరలోనే రంగనాదు పై వేటు పడనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## మొబైల్ ఫోన్లతో బ్రెయిన్ క్యాన్సర్ ముప్పుపై తాజా సర్వేలో ఏం తేలిందంటే..!

ఆధునిక జీవితంలో ప్రతి ఒక్కరూ రోజులో ఎక్కువ గంటలు మొబైల్ ఫోన్లతోనే గడుపుతున్నారు. ఫోన్ లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని వారెంతో మంది. మొబైల్ ఫోన్ల విపరీత వాడకంతో ఎన్నో దుష్పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే మొబైల్ ఫోన్ల వాడకం గురించి తాజా అధ్యయనం వివరాలు కాస్త ఉపశమనం కలిగించేలా ఉన్నాయి. మొబైల్ ఫోన్లతో బ్రెయిన్ క్యాన్సర్ ముప్పు పెరగదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.మొబైల్ ఫోన్లు, బ్రెయిన్ క్యాన్సర్ మధ్య ఎలాంటి సంబంధం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%) రివ్యూ వెల్లడించింది. గత కొద్ది దశాబ్దాలుగా మొబైల్ ఫోన్ వాడకం విపరీతంగా పెరిగినా అదే స్థాయిలో బ్రైన్ క్యాన్సర్ల కేసులు పెరగలేదని పేర్కొంది. పదేండ్లకు పైగా మొబైల్ ఫోన్లు వాడుతున్న వారు, మొబైల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడిపేవారిలోనూ బ్రెయిన్ క్యాన్సర్ కేసుల సంఖ్య పెరగలేదని గుర్తించారు. 1994, 2022 మధ్య నిర్వహించిన 63 అధ్యయనాలను ఈ రివ్యూ పరిశీలించింది. ఆస్ట్రేలియా ప్రభుత్వ రేడియేషన్ ప్రొటెక్షన్ అథారిటీ నిపుణులు సహా పది దేశాల నుంచి 11 మంది పరిశోధకులు ఈ రీసెర్చ్‌ను చేపట్టారు.మొబైల్ ఫోన్లు, టీవీలు, బేబీ మానిటర్స్, రాడార్ వంటి పరికరాల్లో ఉపయోగించే రేడియోఫ్రీక్వెన్సీ రేడియేషన్ ప్రభావాలపై ఈ రివ్యూ ప్రధానంగా దృష్టిసారించింది. ఈ అధ్యయనంలో మొబైల్ ఫోన్ల వాడకానికి, బ్రెయిన్ క్యాన్సర్‌కు ఎలాంటి సంబంధం వెల్లడికాలేదని అధ్యయన సహ రచయిత, యూనివర్సిటీ ఆఫ్ అక్లాండ్, న్యూజిలాండ్ క్యాన్సర్ ఎపిడమాలజీ నిపుణులు ప్రొఫెసర్ మార్క్ ఎల్వుడ్ తెలిపారు. ఇక ఇతర రకాల క్యాన్సర్‌లకు సంబంధించిన అధ్యయనం వేరొక నివేదికలో



పొందుపరిచామని చెప్పారు.

# సమస్యా నీదే పరిష్కారమూ నీదే!

### గీతా వాక్యం

**న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖానిచ!**
**కింనో రాజ్యేన గోవింద! కిం భోగైర్జీవితేన వా?**

'కృష్ణా! నాకు విజయంపై కోరికలేదు. ఓ! గోవిందా.. నాకు ఈ రాజ్యంతో గానీ, భోగాలతో గానీ, జీవితంతో గానీ ఏ విధమైన ప్రయోజనం లేదు!' అంటూ కురుక్షేత్రంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. అది కురుక్షేత్రం. అంటేనే కార్యక్షేత్రం. అక్కడ కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, సొంత భావనలకు అవకాశం ఉండదు. క్షత్రియుడిగా అర్జునుడి కర్తవ్యం ధర్మహాని జరుగుతున్న సమయంలో, అధర్మాన్ని నిగ్రహించి ధర్మాన్ని సంస్థాపించడం. నిర్దేశిత ధర్మాచరణకు సిద్ధమై కురుక్షేత్రానికి వచ్చిన అర్జునుడు.. ఇరుసైన్యాలలో తనవారిని చూసి, విమోహియై అస్త్రసన్యాసం చేస్తున్నాడు. కార్యాచరణవేళ సమర్థుడైన వ్యక్తి అస్త్రసన్యాసం చేయడం అవాంఛనీయం.లక్ష్యం నిర్దేశితమైంది. వనరులు సమకూర్చుకున్నారు. యోజనా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించడం జరిగింది. అర్జునుడి కార్య నిర్వహణా దక్షత, ధైర్య సాహసాలు, ప్రజ్ఞాపాటవాలు, గతంలో తాను సాధించిన విజయాలు ప్రాతిపదికగా.. అతణ్ని పూర్తిగా నమ్మి ఏడు అక్షౌహిణులతో పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని ఎదిరించడానికి రంగం సిద్ధమైంది. ఆ సమయంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు.ఇక్కడ కృష్ణా, గోవిందా అనే రెండు సంబోధనలు ముఖ్యమైనవి. 'కృష్..' అనేది భూవాచకం. భూమి ఫలితాన్నిస్తుంది. భూమి కృషికి, కర్తవ్యపాలనకు సంకేతం. 'ణ' కారం నివృత్తి మార్గం.



ఫలితాపేక్షతో చేసే కృషి వల్ల మోక్షం రాదు. ఫలితాపేక్షలేకుండా ఎవరైతే కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారో వారికి మోక్షం వస్తుంది. 'నేను చంపుతున్నాను' అనే కర్తృత్వ భావన అర్జునుడిలో ఉంది.గోవిందా అనడంలో%ొ% 'గో' శబ్దం ఇంద్రియాలకు ప్రతీక. ఇంద్రియాలను జయించిన వారికి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేవాడు గోవిందుడు. ఇంద్రియాలను జయించడం అంటే ఇంద్రియాల పని విధానాన్ని అవగాహన చేసుకొని, వాటిని ప్రభావవంతంగా ఉపయోగించుకోవడం మాత్రమే. జీవితమనే మరొక పదం ఉన్నది ఇందులో. బతకడం వేరు, జీవించడం వేరు. జీవించడంలో ప్రయోజనం ఉంది. అర్థవంతమైన, ప్రయోజనకరమైన, ఆనందకరమైన, అభ్యుదయకారకమైనది జీవితం. సుఖభోగాలు రెండూ భౌతిక జీవితానికి సంబంధించినవే. ప్రలోభానికి గురిచేసేవే. రాజ్యమూ శాశ్వతం కాదు. 'అశాశ్వత రాజ్యభోగాల కోసం, అయినవారిని అంతమొందించడం యుక్తమా?' అని సంశయిస్తున్నాడు అర్జునుడు.అర్జునుడు ఇప్పుడు తన సమర్థత కన్నా తక్కువ స్థాయి భావాలని ప్రదర్శించి అవే ఉదాత్తమైనవిగా భ్రమపడుతున్నాడు. తనకు యుద్ధాలు కొత్తనా? ఎన్నో యుద్ధాలలో పాల్గొని జైత్రయాత్రలు చేశాడు. ఆ యుద్ధాలలో ఎందరు చనిపోలేదు? పిరికివాడా.. అంటే కాలకేయ నివాత కవచాది రాక్షసులను నిగ్రహించాడు. ఇంద్రుని అర్ధ సింహాసనాన్ని అధిష్ఠించాడు. భౌతిక సంపదల పట్ల ఉదాసీనత మోక్షానికి అవసరమే! కానీ, అర్జునుడిలో ఇంకా అలాంటి మానసికస్థితి ఉత్పన్నం కాలేదు. అతని మనసు, బుద్ధి కలత చెంది ద్వైదీ భావనలతో సంక్షుభితమై అయోమయంలో ఉన్నాయి. కర్తవ్యంపై అసంతృప్తితో కూడిన వేదన కలిగింది. విభ్రమకు లోనైన మనసుతో తనది కారుణ్య భావన అనే ముసుగులో నిర్వికారతను ఆశ్రయించాడు. అర్జునుడు ధర్మ స్థాపనలో అనివార్యమైతే యుద్ధంలో ఎవరినైనా ఎదిరించాలే కానీ, క్లీబత్వాన్ని చూపకూడదనే జ్ఞానం లేనివాడా? అంటే కాదు. మరి ఎందుకా నిర్వేదన? మనసు చంచలమైనప్పుడు సందిగ్ధత పలకరిస్తుంది. ఆ సమయంలోనే మార్గదర్శకుడు అవసరమవుతాడు. వ్యక్తిలో సహజ స్థితియైన చేతన వెలుగు చూడాలి. దానికి ప్రేరణనిస్తూ వ్యక్తిని కర్తవ్యపరాయణుడిని చేసే దిశలో నడిపించేది భగవద్గీత.

# శ్రీవరసిద్ధి వినాయకస్వామినే నమః ధ్యాయామి ధ్యానం సమర్పయామి

(కింది శ్లోకం చదువుతూ స్వామిపై అక్షతలు వేస్తూ నమస్కరించాలి) ఆవాహనం శ్లో? అత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చితేశ్వర అనాథనాథ సర్వజ్ఞ, గౌరీగర్భ సముద్భవ ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః ఆవాహయామి ఆవాహనం సమర్పయామి (కింది శ్లోకం చదువుతూ స్వామిపై అక్షతలు వేస్తూ నమస్కరించాలి)ఆసనం శ్లో? మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితం రత్న సింహాసనం చారు ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః నవరత్న ఖచిత స్వర్ణసింహాసనార్థం-హరిద్రాక్షతాన్ సమర్పయామి.(కింది శ్లోకం చదువుతూ పుష్పముతో గణేశుని చేతులపై నీళ్లు చల్లాలి) అర్ఘ్యం శ్లో? గౌరీపుత్ర నమస్తేస్తు శంకరస్య ప్రియనందన గృహాణార్ఘ్యం మయాదత్తం గంధపుష్పాక్షతైర్యుతం ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి (కింది శ్లోకం చదువుతూ పుష్పముతో గణేషుని పాదాలపై నీళ్లు చల్లాలి)పాద్యం శ్లో? గజవక్త్ర నమస్తేస్తు సర్వాభీష్టప్రదాయక భక్త్యాపాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానన ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః పాదయోః పాద్యం సమర్పయామి ఆచమనీయం శ్లో? అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ వరపూజిత గృహాణాచమనం దేవ తుభ్యం దత్తం మయా ప్రభో?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః ముఖే శుద్ధ ఆచమనీయం సమర్పయామి ఏకబిగిన రాసేశాడు తెలివితేటలకు గణపతిని ప్రతీకగా భావిస్తారు. వ్యాసుడు చెప్పిన మహాభారతాన్ని రాసింది ఆయనే. వ్యాసుడు భారతం రాయడానికి సర్వజ్ఞుడైన ఒక లేఖకుడు కావాలనుకున్నాడు. వినాయకుడి కన్నా సమర్థుడైన లేఖకుడు మరెవరూ ఉండరని భావించాడు. తాను చెబుతుంటే మహాభారతం రాసి పెట్టాల్సిందిగా గణేశుడిని అడిగాడు వ్యాసుడు. అయితే, గణపతి వెంటనే సమ్మతించలేదు. వ్యాసుడికి పరీక్ష పెట్టాలనుకున్నాడు. 'మహర్షి తన మనోఫలకంపై దర్శించిన విషయాలు చెబుతారా? పాండిత్య ప్రదర్శన చేస్తారా?' తెలుసుకోవాలని భావించాడు.మహాభారతం రాయడానికి అంగీకరిస్తూనే ఒక షరతు విధించాడు. 'మీరు ఆపకుండా చెబితేనే రాస్తాను, ఎక్కడ తటపటాయించినా ఘంటం పక్కన పెట్టేస్తాను, మళ్లీ ముట్టుకోను' అంటాడు. అందుకు వ్యాసుడు అంగీకరిస్తాడు. అలా లక్షకుపైగా శ్లోకాలు ఉన్న మహాభారతాన్ని ఆపకుండా చెప్పాడు.







వ్యాసుడు చెప్పింది చెప్పినట్టుగా ఆపకుండా కావ్యాన్ని పూర్తిగా రాశాడు గణేశుడు.

### ధర్మసందేహం

గణపతికి కుడుములు, ఉండ్రాళ్లు నైవేద్యంగా ఎందుకు సమర్పిస్తారు?'లక్ష్యం లక్షప్రదో లక్ష్యో లయస్థో లడ్డుకప్రియః లాసప్రియో లాస్యపరో లాభకృల్లోక విశ్రుతః?'అంటుంది గణపతి సహస్రనామ స్తోత్రం. లోకఖ్యాతి గడించిన వినాయకుడిని 'లడ్డుక ప్రియః' అని గణేశ పురాణమూ చెబుతున్నది. అందుకే వినాయకుడికి ఉండ్రాళ్లు, కుడుములు, మోదక్‌లతోపాటు లడ్డూలనూ నివేదనగా సమర్పిస్తారు'ముదాకరాత్త మోదకం, సదా విముక్తి సాధకం' అని గణేశ పంచరత్న స్తోత్రంలో గజాననుడిని స్తుతించారు ఆదిశంకరాచార్యులు. 'మోదకాలను నైవేద్యంగా పెట్టగానే ఆనందించే దైవమా!' అని కీర్తించారు. గణపతికి ఇష్టమైన కుడుముల గురించి పురాణాల్లోనూ ఒక కథ ప్రచారంలో ఉంది.ఒకసారి బాల గణపతితో కలిసి శివపార్వతులు అరణ్యంలో సంచరిస్తుంటారు. గణేశుడికి ఆకలి వేయడంతో సమీపంలో ఉన్న అత్రి మహాముని ఆశ్రమానికి వెళ్తారు. వారికి ఘనమైన అతిథ్యం ఇస్తారు అత్రి మహర్షి, అనసూయాదేవి దంపతులు. ఆకలిగా ఉన్న బాల వినాయకుడికి పంచభక్ష్య పరమాన్నాలు చేసి వడ్డిస్తుంది అనసూయాదేవి.ఎంత తిన్నా, బొజ్జ గణపయ్య ఆకలి తీరదు. అప్పుడు ఆ ఇల్లాలు వరిపిండితో చేసిన కుడుము ఒకటి ఇస్తుంది. అది తినగానే గణపతి బొజ్జనిండి 21సార్లు త్రేన్చాడట! అప్పటినుంచి 21 కుడుములు, 21 ఉండ్రాళ్లు గణపతికి నైవేద్యంగా పెట్టి, ఒక్కోటి గణపతికి ఇచ్చి, పదేసి చొప్పున దానం చేసి, మిగతావాటిని ప్రసాదంగా తీసుకుంటారు. వినాయక మంటపాల్లో కుడుములకు ప్రతిగా లడ్డూను స్వామివారికి నైవేద్యం సమర్పించే ఆచారం ఉంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com